నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, బుధవారం 15 మే 2024 | HYDERABAD

వేసవి తాపం తట్టుకోలేక బర్కత్‌పుర చలివేంద్రంలో మజ్జిగ తాగుతున్న నగరవాసులు

సమావేశంలో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

జల విహారం.. నగర వాసులు ఆటవిడుపుగా జలవిహార్‌లో జలకాలాడారు. పిల్లలు సైతం వేసవి సెలవులు కావడంతో ఈత కొలనులో ఈదుతూ కేరింతలు కొడుతూ ఆనందంగా గడిపారు.

అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా పత్రాల పరిశీలన

అభ్యర్థుల సమక్షంలో మైక్రో అబ్జర్వర్ రిపోర్టు, బుక్‌లెట్స్ పరిశీలన

మాల్ ప్రాక్టీస్ జరగలేదని నిర్ధారించుకునేందుకు పరిశీలన

ఆర్వో, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సిటీబ్యూరో, మే 14 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి జరిగిన ఎన్నికల పోలింగ్ సందర్భంగా విని యోగించిన డాక్యుమెంట్లు సరిగా ఉన్నాయా లేదా.. మాల్ ప్రాక్టీస్ జరగలేదని నిర్ధారించు కోవడానికి డాక్యుమెంట్లను స్క్రూటీనీ చేశా మని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. మంగళవారం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లోని కమలానెహ్రూ పాలి టెక్నిక్ కళాశాలలో ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, పలు రాజకీయ పార్టీల ప్రతిని ధులు, ఏఆర్‌ఓల సమక్షంలో హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో ప్రతి అసెంబ్లీ సెగ్మెం ట్‌లో ఐదు పోలింగ్ కేంద్రాలను ర్యాండమ్ గా స్క్రూటీనీ చేశారు. నియోజకవర్గంలోని యాకత్‌పుర అసెంబ్లీ సెగ్మెంట్‌లో ర్యాండమ్ గా 9,303,44, 130, 270 పోలింగ్ కేంద్రాలు, చార్మినార్ సెగ్మెంట్‌లో 8, 81, 22, 27, 131 పోలింగ్ కేంద్రాలు, మలక్ పేట్ సెగ్మెంట్‌లో 261, 68, 64, 234,300 బహదూర్‌పుర సెగ్మెంట్‌లో 166, 97, 203, 199, 88, 40, 120 పోలింగ్ కేంద్రాలు, గోషామహల్ సెగ్మెంట్‌లోని 22, 26, 129, 151, 214 పోలింగ్ కేంద్రాలను ర్యాండమ్‌గా 17 సీ, 17ఏ, పీఓ డైరీ, విజిట్ షీట్, బుక్‌లెట్‌లను పరిశీలించి అన్ని సరిగానే ఉన్నట్లు నిర్ధారించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జనరల్ అబ్జర్వర్ పీఐ శ్రీవిద్య, పోటీ చేసిన అభ్యర్థులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఏఆర్ఓ వెంకట చారి, మహిపాల్‌రెడ్డి, టి.వెంకన్న, జ్యోతి, విక్టర్ రవి, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశానికి హాజరైన పలు రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు

గ్రేటర్‌లో పెరిగిన ఓటింగ్

2019 పార్లమెంట్ ఎన్నికలతో పోలిస్తే పెరిగిన ఓటింగ్ శాతం

సెటిలర్లు.. జనాలు ఊర్లకు వెళ్లినా గ్రేట్ అనిపించుకున్న రాజధాని ఓటర్

మల్కాజిగిరి మినహా సికింద్రాబాద్, హైదరాబాద్, చేవెళ్లలో మెరుగుపడిన ఓటింగ్ శాతం

గెలుపోటములపై లెక్కల్లో మునిగిన అభ్యర్థులు

గెలుపుపై ఎవరి ధీమా వారిదే..

పెరిగిన ఓటింగ్ అనుకూలమా? ప్రతికూలమా ? అంతుచిక్కని ఓటరు నాడీ

జూన్ 4 వరకు తప్పని నిరీక్షణ

సిటీబ్యూరో, మే 14(నమస్తే తెలంగాణ): రాజధాని ఓటర్ రూట్ మారింది. 2019 పార్లమెంట్ ఎన్నికలతో పోల్చితే అన్ని లోక్‌సభ స్థానాల్లో ఒక్క మల్కాజిగిరి మినహా చేవెళ్ల, సికింద్రా బాద్, హైదరాబాద్ పార్లమెంట్‌లో ఓటింగ్ శాతం పెరిగింది. హైదరాబాద్ నుంచి చాలా మంది సెటిలర్లు, ప్రజలు తమ తమ సొంతూర్లకు ఓటింగ్ కోసం వెళ్లినా... రాజధాని ఓటర్లు తమ సత్తా చాటారు. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో హైదరాబా ద్‌లో 44.84 శాతం పోలింగ్ నమోదైతే ఈ సారి 48.48 శాతంగా నమోదైంది. దాదాపు 4 శాతం పోలింగ్ అధికంగా నమోదైంది. ఇదే క్రమంలో చేవెళ్లలోనూ ఓటింగ్ శాతం పెరి గింది. ఇక్కడ 2019 ఎన్నికల్లో 53.25 శాతం పోలింగ్ నమో దవ్వగా..ఈ ఎన్నికల్లో 56.40 శాతం నమోదైంది. గత ఎన్నిక లతో పోలిస్తే..2 శాతానికి పైగా ఓటర్లు పెరిగారు. అత్యధికంగా చేవెళ్ల అసెంబ్లీ సెగ్మెంట్‌లో 71.83 శాతం పోలింగ్ నమోదైంది. అత్యల్పంగా శేరిలింగంపల్లి సెగ్మెంట్‌లో 43.91 శాతం నమో దైంది. సికింద్రాబాద్‌లోనూ ఇదే రీతిలో పోలింగ్ శాతం అధి కంగా నమోదైంది. గత లోక్‌సభ ఎన్నికల్లో 46.50 శాతం నమోదు కాగా ఈ సారి 49.04 శాతం నమోదైంది. మల్కాజి గిరిలో మాత్రం గత లోకసభ ఎన్నికల్లో 49.63 శాతం నమోదు కాగా..ఈ సారి రూ. 50.78 శాతం మేర నమోదైంది. కాగా మూడు పార్లమెంట్ పరిధిలో పెరిగిన పోలింగ్ సరళితో ఎవరికి నష్టం! ఎవరికి మేలు! అన్న దానిపై రాజకీయ పార్టీల్లో జోరుగా చర్చ జరుగుతున్నది. మరో పక్క అధికార యంత్రాంగం జూన్ 4న జరిగే కౌంటింగ్‌పై దృష్టి పెట్టింది. మొత్తంగా కౌంటింగ్ జరిపే స్ట్రాంగ్ రూమ్‌లకు ఈవీఎంలను పటిష్ట భద్రత నడుమ తరలించారు. 144 సెక్షన్ నిషేధాజ్ఞలను ఎన్నికల అధికారులు అమలు చేస్తున్నారు. కాగా ఓటింగ్ శాతం పెరగడంలో ఎన్నికల అధికారులు చేపట్టిన 'స్వీప్' అవగాహన కార్యక్రమాలు ఫలించాయని అధికార వర్గాలు చెబుతున్నాయి.

మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో..

మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో 50.78 పోలింగ్ శాతం నమోదైంది. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని ఏడు నియో జకవర్గాల పరిధిలో మేడ్చల్ 57.83, మల్కాజిగిరిలో 51.97, కుత్బుల్లాపూర్‌లో 50.19, కూకట్‌పల్లిలో 48.48, ఉప్పల్‌లో 48.45, ఎల్బీనగర్‌లో 46.27, కంటోన్మెంట్‌లో 51.61 పోలింగ్ శాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

ఏ వర్గం ఓటు ఎటు వైపో?

హైదరాబాద్, సికింద్రాబాద్, చేవెళ్ల, మల్కాజిగిరి లోక్‌సభ స్థానంలో 2019 పార్లమెంట్ ఎన్నికలతో పోల్చితే పోలింగ్ శాతం పెరిగింది. ఈ పెరిగిన ఓటింగ్ శాతం ఎవరికీ అనుకూలమో, ప్రతి కూలమో అభ్యర్థులు లెక్కలు వేసుకుంటున్నారు. హైదరాబాద్ పార్లమెంట్‌లో గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి బీజేపీ అభ్యర్థి మాధవీలత గట్టిపోటీ ఇచ్చింది. దీంతో ఎంఐఎం, బీజేపీ మధ్య హోరాహోరీగా పోటీ ఉండటంతో ఎవరూ గెలిచినా స్వల్ప మెజార్టీతోనే గెలిచే అవకాశాలు ఉంటాయని రాజకీయ విశ్లేష కులు చెబుతున్నారు. ఇక సికింద్రాబాద్ పార్లమెంట్‌కు వస్తే బీఆ ర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల త్రిముఖ పోరు ఉంది. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావు గౌడ్ సికింద్రాబాద్ పార్లమెంట్ పరి ధిలో బీఆర్ఎస్ బలంగా ఉందని, ప్రజలు బీఆర్ఎస్‌నే నమ్ముకు న్నారని.. బస్తీ, మైనార్టీ ప్రజల ఓట్లతో గెలుపుపై ఆయన ధీమాతో ఉన్నారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి కిషన్ రెడ్డి అర్బన్ ఎడ్యుకేటెడ్ ఓటర్లు, ఉత్తర భారతీయులపై ఆశలు పెట్టుకున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ మైనార్టీ, బస్తీ వాసుల ఓట్లపై ఆశలు పెట్టుకున్నారు. పెరిగిన పోలింగ్ శాతం ఎటువైపు టర్న్ అవుతుం దనేది అభ్యర్థులకు అంతుచిక్కడం లేదు. చేవెళ్లలోనూ ప్రధాన పార్టీలైన బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థుల మధ్య హోరా హోరీ పోరు నడవగా.. గెలుపుపై ఎవరి ధీమా వారే కనబరుస్తు న్నారు. చేవెళ్ల లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా కాసాని జ్ఞానేశ్వర్, కాంగ్రెస్ నుంచి రంజిత్ రెడ్డి, బీజేపీ నుంచి కొండా విశ్వేశ్వర్ రెడ్డి పోటీ పడ్డారు. తొలి నుంచి కాంగ్రెస్, బీజేపీ ద్విముఖ పోటీగానే భావించాయి. అయితే ఆ తర్వాత పరిస్థితులు మారడంతో త్రిముఖ పోటీ నెలకొన్నది. ఎవరికి వారు గెలుపు అవకాశాలపై ధీమా వ్యక్తం చేస్తున్నారు.

19 రోజుల పాటు తప్పని ఉత్కంఠ..

లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ ఘట్టం ముగిసింది. ఇక కీలకమైన ఎన్నికల ఫలితాలు జూన్ 4న వెలువడ నున్నాయి. ఎవరిని పలుకరించినా..ఎక్కడ ఇద్దరు గుమికూడినా ఎవరు గెలుస్తారనే చర్చ జరుగుతోంది. ఎన్నికల ఫలితాలపై రాజకీయ పార్టీలు, అభ్యర్థుల్లోనూ తీవ్ర ఉత్కంఠ నెలకొన్నది. గెలుపు అవకాశాలపై ఎవ రికి వారు అంచనాల్లో నిమగ్నమయ్యారు. నాలుగు పార్లమెంట్ స్థానాల పరిధిలోని ప్రధాన పార్టీల అభ్య ర్థులు నియోజకవర్గాల వారీగా పోలైన ఓట్ల లెక్కలు, ఆయా ప్రాంతాల్లో ఉన్న పార్టీల బలాబలాలను బేరీజు వేసుకుని ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. కానీ, లోపల మాత్రం ఒకింత భయం పార్టీలను వెంటాడుతున్నది.

ప్రశాంతంగా ఎన్నికలు పూర్తి

ఊపిరి పీల్చుకున్న పోలీసులు.. పోలింగ్ 'డే' ఢీ అంటే ఢీ..

ఆయా ఠాణాల్లో కేసులు.. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రత

సిటీబ్యూరో, మే 14 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా ముగియడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రతపై పోలీసులు దృష్టి పెట్టారు. మరో వైపు పోలింగ్ 'డే' రోజు ఓల్డ్‌సిటీలో కొన్ని చోట్ల ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా.. ఆయా ఘటనలకు సంబంధించి అక్కడక్కడ కేసులు నమోదయ్యాయి. మంగళ్‌హాట్ ఠాణా వద్ద బీజేపీ కార్యకర్తలు డమ్మీ ఈవీఎంతో రాకేశ్ గౌడ్, బంటీ ప్రచారం చేస్తుండటంతో వాళ్లపై పోలీసులు కేసు నమోదు చేసి ఠాణాకు తరలించారు. అయితే ఠాణాలో ఉన్న వారిని విడిపించేం దుకు బీజేపీ అభ్యర్థి మాధవీలత వెళ్లింది. అక్కడ పోలీసుల విధులకు ఆటంకం కల్గించి తమ అనుచరులిద్దరిని తీసుకొని, పోలీసులు స్వాధీనం చేసుకున్న డమ్మీ ఈవీఎంను కూడా తీసుకెళ్లిందని మరో కేసు నమోదు చేశారు. అలాగే సంతోష్‌నగర్‌లో దొంగ ఓటు వేసేందుకు వచ్చిన యువతిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఓటింగ్ సరళిని పరిశీలించేందుకు హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీ, ఎంఐఎం అభ్యర్థులు వారి వారి కార్యకర్తలు, నాయకులతో కలిసి పర్య టించారు. రెండు పార్టీలకు సంబంధించిన నాయకులు ఒక చోట ఎదురు పడినప్పుడు ఉద్రిక్తత నెలకొనడంతో పోలీసులు ఎప్పటిక ప్పుడు పరిస్థితిని చక్కదిద్దుతూ వచ్చారు. ఓటు వేయడానికి వచ్చిన ముస్లిం మహిళల బుర్కా(హిజాబు)ను తీసి మాధవీలత నిబంధనలు ఉల్లంఘించారని కేసు, మధురానగర్ ఠాణాలోనూ బీజేపీ సోషల్‌మీ డియా కోఆర్డినేటర్‌పై కేసు నమోదైంది. నిబంధనలకు విరుద్ధంగా ప్రచారం చేస్తుండటంతో ఓల్డ్‌సిటీలో మరో ఠాణాలో ఎంఐఎం నాయ కులపై కూడా కేసు నమోదు చేశారు. ఇలా ఓల్డ్‌సిటీలో ఒకరిపై ఒకరి ఆరోపణలు, ఎన్నికల అధికారుల ఫిర్యాదులతో ఆయా ఠాణాల్లో కేసులు నమోదయ్యాయి.

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత..

నగర పోలీస్ కమిషనరేట్‌కు సంబంధించిన 13 లొకేషన్లలో 16 స్ట్రాంగ్ రూమ్‌లున్నాయి. జూన్ 4 వరకు ఈవీఎంలు స్ట్రాంగ్ రూమ్‌లో ఉండనున్నాయి. ఇక్కడున్న భద్రతను పోలీస్ ఉన్నతాధికారులతో పాటు జిల్లా ఎన్నికల అధికారులు, పరిశీలకులు ఎప్పటికప్పుడు పరిశీ లిస్తూ ఉంటారు. మూడంచెల భద్రతతో పాటు సీసీ కెమెరాలతో స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద నిఘాను ఏర్పాటు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

ఈవీఎంలు స్ట్రాంగ్ రూమ్‌లో భద్రం

పార్టీల ఏజెంట్ల సమక్షంలో సీల్

మేడ్చల్, మే 14 (నమస్తే తెలంగాణ): మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గానికి సోమవారం జరిగిన పోలింగ్‌కు సంబంధించిన ఎల క్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల(ఈవీఎం)లను నియోజకవర్గ జనరల్ పరి శీలకురాలు ప్రియాంక శుక్లా, జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ గౌతమ్ పలు రాజకీయ పార్టీల ఏజెట్ల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లో సీల్ వేసి సీజ్ చేశారు. హోలీమేరి కళాశాల, సరూర్‌నగర్‌లోని ఇండోర్ స్టేడియం, సికింద్రాబాద్‌లోని వెస్లీ కళాశాలలో ఈవీఎంలను భద్రపరిచారు. మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి హోలీమేరి కళాశాల, ఎల్‌బీనగర్ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలను సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం, కంటోన్మెంట్ నియోజకవర్గానికి సంబంధించి వెస్లీ కళాశా లలో భద్రపరిచినట్లు కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ఈవీఎంలను భద్రప రిచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత, 24 గంటల పాటు సీఆర్పీఎఫ్ నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు.

ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ వద్ద మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల పరిశీలకురాలు ప్రియాంక శుక్లా, మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్

మెట్రో.. ఫుల్ రష్

మూడ్రోజుల సెలవుల తర్వాత ఒక్కసారిగా పెరిగిన ప్రయాణికులు

కిక్కిరిసిన ప్రయాణికులతో రోజంతా రద్దీ

ఉదయం 5.30 గంటల నుంచే అందుబాటులోకి మెట్రో రైలు..

సిటీబ్యూరో, మే 14(నమస్తే తెలంగాణ): వరుసగా మూడు రోజుల సెలవులు, ఎన్నికల హడావిడి ముగియ డంతో మంగళవారం తెల్లవారు జాము నుంచే నగరంలో మెట్రో సర్వీసుల కోసం క్యూ కట్టారు. తెలుగు రాష్ట్రాల్లో ఎన్నికల ప్రక్రియ ముగియడంతో.. హైదరాబాద్‌కు వచ్చే వారితో పాటు నగరంలోని ప్రధాన మెట్రో స్టేషన్లు కిట కిటలాడాయి. ముఖ్యంగా ఏపీ నుంచి వచ్చే వారితో ఎల్బీనగర్, ఉప్పల్ మెట్రో స్టేషన్లతోపాటు, సికింద్రాబాద్ మెట్రో స్టేషన్లకు భారీగా ప్రయాణికులు చేరుకున్నారు. సెలవులు ముగియడంతో ఉద్యోగరీత్యా ఇండ్లకు చేరుకు నేందుకు మెట్రోను ఆశ్రయించినట్లు మెట్రో వర్గాలు పేర్కొన్నాయి. అయితే నగరానికి వచ్చే వారిని దృష్టిలో పెట్టు కుని ఉదయం 5.30గంటల నుంచి సర్వీసులు అందుబాటులోకి తీసుకొచ్చింది. దీంతో మంగళవారం తెల్లవారు జాము నుంచే నగరంలోని ప్రధాన మెట్రో స్టేషన్లు, బస్ స్టేషన్లతో పాటు, రైల్వే జంక్షన్లు కూడా వచ్చిపోయే ప్రయా ణికులతో నిండి ఉన్నాయి. ఇక మంగళవారం ఆఫీసులకు వెళ్లే వారితో మెట్రోకు ప్రయాణికుల సంఖ్య పెరిగినట్లు తెలిసింది. గత నాలుగు రోజులు జనాలు లేకపోవడంతో బోసిపోయి ఉన్న మెట్రో స్టేషన్లు, ఒక్కసారిగా రద్దీగా మారిపోయాయి. అదే సమయంలో మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో జనాలు నిండిపోవడంతో సుదూర ప్రాంతాల నుంచి నగరానికి చేరుకుని, ఇక్కడి నుంచి ఇండ్లకు చేరుకునేందుకు మెట్రోను ఆశ్రయించిన వారే ఎక్కు వగా ఉన్నట్లు తెలిసింది. ప్రస్తుతం నగరంలో ఆటో, క్యాబ్ ధరలతో పోల్చితే మెట్రో ద్వారా తక్కువ ఖర్చులో ప్రయాణించే వీలు ఉండటంతో రద్దీ పెరగడానికి కారణాలు చెబుతున్నారు. ప్రధాన మార్గాల్లోనూ మెట్రోకు ఆద రణ వస్తుండగా.. క్రమంగా ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్నట్లు మెట్రో గణాంకాల్లోనూ తేలింది.